క్లుప్తంగా

మాజీ ఎంపీని కలసిన విజయసారథి



భరత్‌రామ్‌ను కలసిన విజయసారథి, ఇతర నాయకులు

రాజమహేంద్రవరం సిటీ: వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎంపీ మార్గాని భరత్ రామ్‌ను పార్టీ క్రిస్టియన్ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు రెవ.ఎం.విజయసారథి శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. క్రిస్టియన్ మైనారిటీ కమ్యూనిటీ సహకారంతో, మైనార్టీసెల్ రాష్ట్ర అధ్యక్షుడు బొల్లవరపు జాన్ వెస్లీ, స్థానిక పార్టీ కో–ఆర్డినేటర్లు, పార్టీ ప్రతినిధులతో కలిసి వైఎస్సార్ సీపీని బలోపేతం చేసేందుకు కృషి చేస్తానని తెలిపారు. మాజీ ముఖ్యమంత్రి, పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయాలి

కడియం: మండలంలోని అన్ని ప్రైవేటు, అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు 25 శాతం సీట్లు పొందేందుకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఎంఈవోలు మణికుమార్, నాగేశ్వరరావు తెలిపారు. అనాథ పిల్లలు/ హెచ్ఐవీ బాధితులు/ దివ్యాంగులకు ఐదు శాతం, ఎస్సీలకు 10 శాతం, ఎస్టీలకు 4 శాతం, బలహీన వర్గాలకు చెందిన బీసీ/మైనార్టీ/ఓసీ గ్రామీణ ప్రాంతాల్లో వార్షికాదాయం రూ.1.20 లక్షలు, పట్టణ ప్రాంతాల్లో రూ.1.44 లక్షలకు లోపు ఉన్నవారికి ఆరు శాతం సీట్లు కేటాయిస్తారన్నారు. వివరాలకు టోల్ ఫ్రీ నంబరు 18004258599లో సంప్రదించవచ్చని చెప్పారు.

జిల్లా పంచాయతీ అధికారికి అభినందనలు




శాంతామణికి అభినందనలు తెలుపుతున్న సంఘ సభ్యులు

రాజమహేంద్రవరం రూరల్: జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా వేస్ట్ మేనేజ్‌మెంట్ విభాగంలో ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ నుంచి ద్వితీయ బహుమతి అందుకున్న జిల్లా పంచాయతీ అధికారి వి.శాంతామణికి జిల్లా పంచాయతీ కార్యదర్శుల సంఘ సభ్యులు శుక్రవారం అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమెకు పుష్పగుచ్ఛం అందజేశారు. పంచాయతీల కార్యదర్శులు, జిల్లా పంచాయతీ అధికారి కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆటో ప్రయాణికుడి వద్ద నగదు చోరీ

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): ఆటోలో ప్రయాణిస్తుండగా ప్యాంట్ జేబులో ఉన్న రూ.40 వేల నగదు చోరీ అయ్యాయని కంబాలచెరువు ప్రాంతానికి చెందిన ఎ.వీరభద్రరావు శుక్రవారం టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసుల వివరాల మేరకు, కంబాలచెరువు ప్రాంతానికి చెందిన వీరభద్రరావు జాంపేట వద్ద రైల్వే స్టేషన్ పార్శిల్ ఆఫీసుకు వెళ్లేందుకు ఆటో ఎక్కాడు. రైల్వే పార్శిల్ ఆఫీసు వద్ద దిగి చూసుకునేసరికి ప్యాంటు జేబులో ఉన్న రూ.40 వేలు నగదు మాయమయ్యాయి. ఈ మేరకు వీరభద్రరావు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. టూటౌన్ ఇన్‌స్పెక్టర్ శివగణేష్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

యువకుడి అదృశ్యం



జుత్తుక సంజీవ్ (ఫైల్)

రాజమహేంద్రవరం రూరల్: ఇంటి నుంచి వెళ్లిన తన కుమారుడు ఇప్పటివరకు తిరిగి రాలేదని ఆనంద్‌నగర్‌కు చెందిన జుత్తుక సునీత త్రీటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసుల వివరాల మేరకు, ఆనంద్‌నగర్‌కు చెందిన 25 ఏళ్ల జుత్తుక సంజీవ్ స్థానిక ప్రభుత్వాస్పత్రిలో ల్యాబ్ టెక్నీషియన్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ఈ నెల 20వ తేదీన ఇంటి నుంచి వెళ్లిన సంజీవ్ ఇప్పటివరకు తిరిగి రాలేదని సునీత పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు త్రీటౌన్ ఎస్సై జుబేర్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

సైకిల్ మెకానిక్‌లకు గొడుగుల పంపిణీ

రాజమహేంద్రవరం సిటీ: స్వర్ణాంధ్ర సేవా సంస్థ ఆధ్వర్యంలో చిరు వ్యాపారులకు, చేతు వృత్తుల వారికి ఎండవానల నుంచి రక్షణ కోసం గొడుగులు పంపిణీ చేశారు. శుక్రవారం స్థానిక వీఎల్ పురంలో ఎమ్మెల్యే కార్యాలయం వద్ద సైకిల్ మెకానిక్‌లకు సంస్థ సమకూర్చిన గొడుగులను సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అందించారు. నగరంలో చిరు వ్యాపారుల కోసం గొడుగులు ఉచితంగా అందిస్తున్నామని, అవసరార్థులు ఆధార్ కార్డు జిరాక్స్, రెండు ఫొటోలతో స్వయంగా లాలాచెరువులోని స్వర్ణాంధ్ర సేవా సంస్థను సంప్రదించాలని సంస్థ నిర్వాహకులు రాంబాబు కోరారు.

ఉగ్రవాదంపై కన్నెర్ర



బ్యాంక్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో..



రాయల్ మాస్క్ ట్రస్ట్ బోర్డు సభ్యుల నిరసన

రాజమహేంద్రవరం సిటీ: అభం శుభం తెలియని అమాయక ప్రజల ఉసురు తీస్తున్న ముష్కరులపై ప్రజాస్వామిక వాదులు కన్నెర్రజేశారు. మానవతా విలువల్లేని ఉగ్రవాదంపై నిరసన గళం వినిపించారు. పౌర సమాజాన్ని విచ్ఛిన్నం చేసే ఇటువంటి దుష్టశక్తులకు కాలం చెల్లిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. జమ్ము–కశ్మీర్‌లోని పహల్గామ్‌లో పర్యాటకులపై జరిగిన ఉగ్రదాడి అమానుషమని స్థానిక మెయిన్ రోడ్‌లోని రాయల్ మాస్క్ ట్రస్ట్ బోర్డు గౌరవ సలహాదారు అసదుల్లా అహ్మద్ ధ్వజమెత్తారు. శుక్రవారం జుమా నమాజ్ అనంతరం ముస్లింలు ఈ చర్యను ముక్తకంఠంతో ఖండించారు. ఈ సందర్భంగా అసదుల్లా అహ్మద్ మాట్లాడుతూ, భారత రాజ్యాంగం సూచించిన విధంగా కులమతాలకు అతీతంగా దేశంలో అందరూ సోదర భావంతో కలిసిమెలిసి ఉంటున్నారని చెప్పారు. మత సామరస్యం ఓర్వలేక ముష్కరులు భారతీయులపై పాశవికంగా కాల్పులు జరపడం పిరికిపంద చర్యగా అభివర్ణించారు. ప్రభుత్వం ఉగ్రవాదులపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ట్రస్ట్ అధ్యక్షులు షేక్ అబ్దుల్ కరీమ్ మాట్లాడుతూ, ఇస్లాం అంటేనే శాంతి అని, హింసకు తావులేదన్నారు. హింసకు పాల్పడేవారు నిజమైన ముస్లింలు కారని స్పష్టం చేశారు. ఎవరెన్ని కుట్రలు చేసినా దేశంలో మతసామరస్యాన్ని భంగం కలిగించలేరన్నారు. ట్రస్టీలు మూసా, ఎస్.ఘన్‌షా, ఇమామ్ అబ్దుల్ హఫీజ్‌ఖాన్, మౌజన్ ఇబ్రహీం, జహంగీర్, ఖుద్దుస్ బాషా తదితరులు పాల్గొన్నారు. స్థానిక జాంపేట ఆజాద్‌చౌక్‌లో ముస్లిం జేఏసీ ఆధ్వర్యంలో మహిళలు నిరసన ర్యాలీ చేపట్టారు.



ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ

అత్యంత పాశవిక చర్య

జమ్ము–కశ్మీర్‌లో జరిగిన ఉగ్రవాదుల చర్యలు అత్యంత పాశవికమని జిల్లా బ్యాంక్ ఉద్యోగుల సంఘం కార్యదర్శి లక్ష్మీపతిరావు ఆవేదన వ్యక్తం చేశారు. సంఘం ఆధ్వర్యంలో స్థానిక పుష్కరఘాట్‌లో నిరసన కార్యక్రమం చేపట్టారు. 26 మంది పర్యాటకులను కిరాతకంగా హతమార్చడం వారి దాష్టీకాన్ని తెలియజేస్తుందన్నారు. ఉగ్రవాదులు ఎక్కడున్నా కఠినంగా శిక్షించాలని, వారిని ప్రోత్సహించిన దేశాలపై తీసుకునే ప్రతి నిర్ణయానికి ప్రజలంతా కట్టుబడి ఉండాలని విజ్ఞప్తి చేశారు. అసువులు బాసిన అమాయక ప్రజలకు శ్రద్ధాంజలి ఘటించారు. బాధితులకు న్యాయం చేయాలని, ఉగ్రమూకలను కఠినంగా శిక్షించాలంటూ బ్యాంకు ఉద్యోగులు కొవ్వొత్తులతో నిరసన తెలిపారు.

ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో..

దేశ సమైక్యతను కాపాడుకుంటూ, ఉగ్రవాదాన్ని అణచివేసేందుకు ప్రతిఒక్కరూ నినదించాలని ది రాజమండ్రి ప్రెస్ క్లబ్ సభ్యులు పిలుపునిచ్చారు. జమ్ము–కశ్మీర్‌లో జరిగిన అమానుష ఘటనను నిరసిస్తూ కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. ఉగ్రవాదాన్ని అణచివేయాలని, మత సామరస్యాన్ని పెంపొందించాలంటూ నినాదాలు చేశారు.

మానవహారం

కడియం: ఉగ్రదాడిని నిరసిస్తూ కూటమి నాయకులు మండల కేంద్రమైన కడియంలో శుక్రవారం మానవహారంగా నిర్వహించారు. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దేశ సమగ్రతను దెబ్బతీసే ఇటువంటి కుట్రలపై కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.



కొవ్వొత్తులతో నిరసన తెలుపుతున్న నాయకులు

యూటీఎఫ్ కొవ్వొత్తుల ర్యాలీ

రాజమహేంద్రవరం రూరల్: పెహల్గామ్‌లో పర్యాటకులపై అమానవీయంగా వ్యవహరించిన ఉగ్రవాదులపై కఠిన చర్యలు తీసుకోవాలంటూ యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం.జయకర్, ఎ.షరీఫ్ అన్నారు. యూటీఎఫ్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి రాజమండ్రి కంబాల చెరువు వద్ద కొవ్వొత్తులతో శాంతి ప్రదర్శన చేశారు. అనంతరం గోకవరం బస్టాండ్ అంబేడ్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. ఉగ్ర చర్యలు నశించాలని, దోషులను కఠినంగా శిక్షించాలంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా మానవహారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అసోసియేట్ ఎం.విజయగౌరి, జిల్లా కార్యదర్శులు ఈ.శ్రీమణి, కె.రమేష్‌బాబు, చిలుకూరి శ్రీనివాసరావు, ఎం.శ్రీనివాసు, కె.దయానిధి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రూపస్‌రావు, రాష్ట్ర కౌన్సిలర్ ఎస్.అనిత, ప్రకాష్‌రావు, విజయ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

నల్లబ్యాడ్జీలతో ప్రదర్శన



నల్ల రిబ్బన్లు ధరించి, కొవ్వొత్తులతో ప్రదర్శన చేస్తున్న ఫార్మసీ విద్యార్థులు

రాజానగరం: పహెల్గామ్‌లో ఉగ్రవాదుల దాడిలో బలైన పర్యాటకులకు నివాళులర్పిస్తూ స్థానిక గైట్ స్కూల్ ఆఫ్ ఫార్మసీ విద్యార్థులు శుక్రవారం నల్ల రిబ్బన్లు ధరించి, కొవ్వొత్తులతో ప్రదర్శన చేశారు. మృతుల ఆత్మలకు శాంతి చేకూరాలని ప్రార్థించారు.

ఉగ్రదాడికి నిరసనగా మానవహారం

సీతానగరం: జమ్ము–కశ్మీర్‌లో జరిగిన ఉగ్రదాడికి నిరసనగా శుక్రవారం స్థానిక బస్టాండ్ సెంటర్‌లో కూటమి నాయకులు నిరసన కార్యక్రమం నిర్వహించారు. నల్ల బ్యాడ్జీలు ధరించి, మానవహారంగా ఏర్పడ్డారు. ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ మాట్లాడుతూ, ఈ మారణకాండ విచారకరమన్నారు. అనంతరం ఉగ్రదాడిలో మరణించిన వారికి నివాళులర్పించి, వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.



సీతానగరం బస్టాండ్ సెంటర్‌లో చేపట్టిన నిరసన

మలేరియాపై అవగాహన అవసరం

డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకటేశ్వరరావు

రాజమహేంద్రవరం రూరల్: ప్రాణాంతకమైన మలేరియా వ్యాధిపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి డాక్టర్ కె.వెంకటేశ్వరరావు అన్నారు. శుక్రవారం ప్రపంచ మలేరియా నివారణ దినం సందర్భంగా బొమ్మూరులోని డీఎంహెచ్‌వో కార్యాలయం వద్ద అవగాహన ర్యాలీని ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ, మనతోనే మలేరియా అంతం అనే నినాదంతో మలేరియా నివారణ దినాన్ని నిర్వహిస్తున్నామన్నారు. జిల్లా మలేరియా అధికారి ఎ.జ్ఞానశ్రీ మాట్లాడుతూ, నీటి నిల్వలు లేకుండా, చెత్త చెదారం పేరుకుపోకుండా పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. ప్రతి శుక్రవారం డ్రై డే, ఫ్రైడే పాటించాలని కోరారు. చలి జ్వరం లాంటి లక్షణాలు ఉంటే మలేరియా అనుమానంతో సమీపంలోని వైద్యులను సంప్రదించాలని సూచించారు. మలేరియా నిర్మూలనపై పలు నినాదాలతో ప్రజలకు అవగాహన కలిగిస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డిస్ట్రిక్ట్ ఎక్స్‌టెన్షన్ మీడియా ఆఫీసర్ ఎన్.సత్యకుమార్, వైద్యారోగ్య సిబ్బంది పాల్గొన్నారు.



బొమ్మూరులో ర్యాలీని జెండా ఊపి ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌వో

పరిసరాల పరిశుభ్రతతో నియంత్రణ

కడియం: దోమలు ప్రబలకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచితే మలేరియాను నియంత్రించవచ్చని కడియం ప్రభుత్వాస్పత్రి వైద్యాధికారి మణి జ్యోత్స్న అన్నారు. ప్రపంచ మలేరియా నివారణ దినాన్ని పురస్కరించుకుని కడియం సీహెచ్‌సీ పరిధిలో కడియం పంచాయతీ వద్ద నుంచి అవగాహన ర్యాలీ నిర్వహించారు. సర్పంచ్ మోసిగంటి సత్యవతి, ఉప సర్పంచ్ వెలుగుబంటి రఘురామ్ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత, దోమల నిర్మూలన తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైద్యారోగ్య సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.



కడియంలో ర్యాలీ చేస్తున్న వైద్యారోగ్య సిబ్బంది

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం



రాజమహేంద్రవరం సిటీ: చెట్ల కొమ్మల నరికివేత, వార్షిక మరమ్మతుల కోసం శనివారం నగరంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏపీఈపీడీసీఎల్ రాజమండ్రి ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ నక్కపల్లి శ్యామ్యూల్ శుక్రవారం తెలిపారు. ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం 12.30 వరకు స్థానిక ఏవీ అప్పారావు రోడ్ కోదండ రామాలయం, రామాలయం సెంటర్, శ్రీనివాస నగర్, జయశ్రీ గార్డెన్స్ 1, 2, 3, 4, 5 వీధులు, పిల్లి వారి వీధి , తోట రాములు నగర్, ఏవీఏ రోడ్, శ్యామల నగర్, శారదా నగర్, అద్దేపల్లి కాలనీ, షీలా నగర్, బైబిల్ ప్లేస్, పాత సవేరా బార్ వెనుక ప్రాంతం, శ్రీనివాస గార్డెన్స్, సాయి టవర్స్, నేతాజీ టవర్స్, బాలాజీ స్ట్రీట్, వేంకటేశ్వర స్వామి ఆలయం రోడ్, గోపాల్‌నగర్ పుంత, రాజేంద్రనగర్ పరిసర ప్రాంతాలలో అంతరాయం ఉంటుందన్నారు. ఉదయం 7.30 నుంచి 10:30 వరకు స్థానిక శేషయ్యమెట్ట, కోర్టు ప్రాంతం, తుమ్మలావ, రెడ్డిలపేట, కృష్ణానగర్, కొత్త రోడ్, జీఎస్ఎల్ హాస్పిటల్, మాజీ మేయర్ వీధి, లింగంపేటల్లో అంతరాయం ఏర్పడుతుందని చెప్పారు. ఉదయం ఏడు నుంచి మధ్యాహ్నం 12 వరకూ స్థానిక రామకృష్ణ నగర్, ఆదర్శ నగర్, సావిత్రీనగర్, చైతన్యనగర్, మూడు గుళ్ల ఏరియాల్లో సరఫరా నిలిపివేస్తారన్నారు. ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 12 వరకూ స్థానిక రిలయన్స్ స్మార్ట్ ఏరియా, బ్రదరన్ చర్చి, నాగరాజా స్కూల్, గిరిజన కార్పొరేషన్, చెరుకూరి వారి ఏరియా, విద్యానగర్, వీవర్స్ కాలనీ, రావి చెట్టు, చర్చి ఆఫ్ గాడ్, గణేష్‌నగర్, పీఅండ్‌టీ కాలనీ, పోస్టాఫీస్ రోడ్, జయకృష్ణపురం, మార్కెట్ యార్డు ప్రాంతాల్లో అంతరాయం ఉంటుందని తెలిపారు.

జాబ్ ఫెస్ట్‌లో 407 మంది ఎంపిక



ఎంపికైన విద్యార్థులతో ఎమ్మెల్యే, ప్రిన్సిపాల్, డీఎస్‌డీవో తదితరులు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): కాలేజియేట్ ఎడ్యుకేషన్ కమిషనర్ ఆదేశాల మేరకు స్కిల్ డెవలప్‌మెంట్ సహకారంతో శుక్రవారం స్థానిక రాజమహేంద్రవరం గవర్నమెంట్ కళాశాల(అటానమస్)లో 41 కంపెనీలతో జరిగిన జాబ్ ఫెస్ట్‌లో 407 మంది ఎంపికయ్యారు. నోడల్ రీసోర్స్ సెంటర్ పరిధిలోని డిగ్రీ కళాశాలలు, ఇతర కళాశాలల నుంచి మొత్తం 1,156 మంది హాజరయ్యారని ప్రిన్సిపాల్ డాక్టర్ రామచంద్ర ఆర్‌కే తెలిపారు. ఈ సందర్భంగా సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు ఎంపికైన విద్యార్థులకు నియామక పత్రాలను అందజేశారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ శ్రీరామమూర్తి, వివిధ విభాగాల హెచ్‌ఓడీలు, స్కిల్ డెవలప్‌మెంట్ డీఎస్‌డీవో వీడీజీ మురళి, కళాశాల జేకేసీ కో–ఆర్డినేటర్ డాక్టర్ బి.హరినాథ్ రెడ్డి, ప్లేస్‌మెంట్ ట్రైనర్ ఎం.కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మండల కేంద్రాలకు పాఠ్య పుస్తకాల తరలింపు

ధవళేశ్వరం: వచ్చే విద్యా సంవత్సరానికి పాఠ్య పుస్తకాల సరఫరా ప్రారంభమైందని జిల్లా పాఠశాల విద్యా శాఖాధికారి కంది వాసుదేవరావు తెలిపారు. ధవళేశ్వరంలోని పాఠ్య పుస్తకాల గోడౌన్ నుంచి మండల కేంద్రాలకు ఆర్టీసీ బస్సుల ద్వారా పుస్తకాల పంపిణీని శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా వాసుదేవరావు మాట్లాడుతూ, స్కూళ్లు తెరిచే నాటికి విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు అందజేస్తామని చెప్పారు. పాఠ్య పుస్తకాల బరువు తగ్గిందని, విద్యార్థులకు ఇది ఉపయుక్తంగా ఉంటుందన్నారు. ఆయన వెంట పాఠ్య పుస్తకాల డిపో మేనేజర్ పి.సురేష్, ఆర్టీసీ రవాణా ప్రతినిధి మూర్తి ఉన్నారు.



పుస్తకాల సరఫరాను పరిశీలిస్తున్న జిల్లా పాఠశాల విద్యాశాఖాధికారి వాసుదేవరావు

స్పీడ్ బ్రేకర్లపై తక్షణ చర్యలు తీసుకోవాలి

రాజమహేంద్రవరం రూరల్: స్పీడ్ బ్రేకర్లతో ప్రాణ నష్టం , ప్రమాదాలు, వాహన నష్టాలు జరగకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని జిల్లా కాంగ్రెస్ మాజీ సైనికుల విభాగం చైర్మన్ నున్న మోహనరావుచౌదరి ఓ ప్రకటనలో కోరారు. హైవేలు, జిల్లా ప్రధాన రోడ్లు, గ్రామీణ రోడ్లపై నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేసిన స్పీడ్ బ్రేకర్లపై తక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే ఇండియన్ రోడ్డు కాంగ్రెస్ మార్గదర్శకాలు పాటించాలని కోరారు. ఆంధ్రప్రదేశ్ రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్, పురపాలక పట్టణాభివృద్ధి కమిషనర్, పంచాయతీ గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్, ఆర్‌అండ్‌బీ చీఫ్ ఇంజినీర్, జిల్లా మెజిస్ట్రేట్ తక్షణం స్పందించాలన్నారు. ఇండియన్ రోడ్డు కాంగ్రెస్ 1996 ప్రకారం నిర్ణీత కొలతలు, రంగులు స్పీడ్ బ్రేకర్లకు ఉండాలన్నారు. అలాగే 40 మీటర్ల దూరంలో హెచ్చరిక బోర్డులు తప్పనిసరిగా ఉండాలని చెప్పారు. అనేక ప్రాంతాల్లో రాత్రికి రాత్రి నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేస్తున్న స్పీడ్ బ్రేకర్లతో ప్రజల ప్రాణాలకు ముప్పు వాటిల్లుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇందుకు ఆయా అధికారులే బాధ్యత వహించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు.

కాంగ్రెస్ మండల కమిటీల నియామకం

కడియం: రాజమండ్రి రూరల్, కడియం మండలాలకు కాంగ్రెస్ పార్టీ కమిటీలను నియమించారు. బుర్రిలంకలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశంలో పార్టీ రూరల్ కో–ఆర్డినేటర్ తాడాల కొండ్రాజు వివరాలు తెలిపారు. రూరల్ మండలానికి యాళ్ల వీరభద్రరావు, కడియం మండలానికి పేరిచర్ల సత్యనారాయణరాజును అధ్యక్షులుగా నియమించామన్నారు. ప్రభుత్వాల ప్రజావ్యతిరేక విధానాలపై పోరాడుతామని తెలిపారు.

ముగిసిన క్రీస్తు సువార్త మహాసభలు

కడియం: వేమగిరితోటలోని పెంతుకోస్తు ప్రార్థన మందిరం 26వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని మూడు రోజుల పాటు నిర్వహించిన యేసయ్య సువార్త మహాసభలు ఘనంగా ముగిశాయి. సంఘ కాపరి పి.ప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన ముగింపు కార్యక్రమంలో రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి పాల్గొన్నారు. వివిధ ప్రాంతాలకు చెందిన దైవజనులు మమెన్, కె.శ్యామల, పి.జేమ్స్, షేక్ ప్రభుకిరణ్, పందు డేవిడ్‌రాజు, జి.సముయేలు, పవిత్ర, పి.సత్యప్రసాద్, సత్యసువర్ణల సందేశాలు, క్రైస్తవ గీతాలు ఆకట్టుకున్నాయి. మూడు రోజుల సభలకు విచ్చేసిన విశ్వాసులకు భోజన సదుపాయాలు కల్పించి, దుస్తులు పంపిణీ చేశారు.



దుస్తులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే గోరంట్ల

ఏడు ఇసుక లారీలు సీజ్

సీతానగరం: నిబంధనలకు విరుద్ధంగా ఇసుకను తరలిస్తున్న లారీలను ఎస్సై డి.రామ్‌కుమార్ సీజ్ చేశారు. ప్రభుత్వం అనుమతించిన వంగలపూడి ర్యాంపు నుంచి గురువారం రాత్రి 11 గంటలకు ఏడు ఇసుక లారీలను ఎస్సై సీజ్ చేసి, స్టేషన్‌కు తరలించారు. ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఇసుక లారీలు వెళ్లడానికి అనుమతి ఉంది. పర్మిషన్ లేని సమయంలో ఇసుకను తరలిస్తున్న లారీలపై చర్యలు తీసుకోవాలని మైన్స్ డిపార్ట్‌మెంట్‌కు ఫిర్యాదు అందించినట్టు ఎస్సై తెలిపారు.